

### టేస్టీ టేస్టీ చికెన్ డిన్నర్..

మున్సిపాలిటీ పగ్గాలు ఇలా చేతికి దక్కావో లేదో.. అలా కొంతమంది ప్రముఖులకు నెలనెలా చికెన్ డిన్నర్ లభిస్తుందనే చర్చ నడుస్తోంది. జిల్లా కేంద్రంలోని చికెన్ వ్యర్థాలను తరలించేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నేత బినామీ కాంట్రాక్టు దక్కించుకున్నారు. ఇదే వ్యర్థాల తరలింపునకు టెండర్లు కూడా ప్రకటించారు. మళ్లీ ఏమైందో ఏమో కానీ టెండర్ రద్దయి అతనికే తిరిగి అప్పగించారు. దీంతో మున్సిపాలిటీలోని ఒకరిద్దరూ నాయకులతో పాటు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు ప్రతినెల చికెన్ డిన్నర్ రూపంలో వెళుతుండడం చర్చనీయాంశంగా మారింది. సడన్‌గా స్పెషల్ ఆఫీసర్ల పాలన రావడంతో చికెన్ డిన్నర్ ఒకరిద్దరికే పరిమితమైందని మాజీ నాయకులు బాధపడుతున్నారట.. ఇప్పుడు అంతా ఆఫీసర్ల చేతుల్లోకి వెళ్లడంతో.. ఒక ఆఫీసర్ నాకు చికెన్ డిన్నర్ కావాలని పట్టుబడుతున్నాడట.. నగర పాలక సంస్థలో ఇప్పుడు ఈ చికెన్ డిన్నర్ హాట్ హాట్ టాపిక్‌గా మారింది.




పాలమూరులో మూతబడిన దుకాణాలు

# పైసా వసూల్!

- అద్దె దుకాణాలపై కార్పొరేషన్ కొరడా
- రూ.22 కోట్లు బకాయిపడ్డ దుకాణదారులు
- నగర పాలక సంస్థగా మారగానే బాకీ వసూళ్లు
- పాలకవర్గం ఉన్నప్పుడు పట్టించుకోని నేతలు
- స్పెషల్ ఆఫీసర్ పాలనలో వసూళ్లకు శ్రీకారం
- అధికారులను బాధ్యులు చేసేలా పెద్దల స్కెచ్
- రాయబారాలు నడుపుతున్న వైనం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాలమూరు పురపాలక సంఘం నగర పాలక సంస్థగా మారగానే వసూళ్లపై దృష్టి సారించింది. ఏడాదిగా మున్సిపాలిటీలో అధికారం అనుభవించిన కాంగ్రెస్ పెద్దలు. దుకాణాల అద్దెలపై మౌనం వహించి వసూలు చేయకుండా కాలం గడిపిపోయారు. స్పెషల్ ఆఫీసర్ పాలన రాగానే అధికార యంత్రాంగం తమ ప్రతాపం చూపిస్తున్నది. కొందరు సర్కారు పెద్దలు అదే వసూల్ అంశాన్ని తెరమీదకి తెచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. మున్సిపాలిటీ.. కార్పొరేషన్‌గా మారిపోయి సంబురపడిపోతున్న తరుణంలో అధికార యంత్రాంగం ఏకంగా అద్దె చెల్లించని దుకాణాలను సీజ్ చేసింది. నోటీసులు ఇవ్వకుండా సీజ్ చేయడంతో వ్యాపారులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో దుకాణాల కిరాయిలపై అప్పటి మున్సిపల్ శాఖ మంత్రిని కలిసి ఒప్పందం కుదుర్చుకున్నారు. తీరా ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక బలవంతంగా వసూళ్లకు పాల్పడుతోందని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి కొంత మంది కౌన్సిలర్లను బలవంతంగా కాంగ్రెస్‌లో చేర్పించుకొని ఆ తర్వాత మెజారిటీ లేకుండా మున్సిపాలిటీ పగ్గాలను చేపట్టింది. దాదాపు ఏడాదిగా పరిపాలన అనుభవించి.. మున్సిపాలిటీ ఆదాయాన్ని మొత్తం కొల్లగొట్టి ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయారు. అప్పట్లో దుకాణాల అద్దెలపై దృష్టి సారించకుండా వదిలేశారు. తాజాగా నగర పాలక సంస్థ అధికారులు సుమారు 50కిపైగా దుకాణాలను సీజ్ చేశారు. ఇదిలా ఉండగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సర్కిల్‌లో మున్సిపల్ దుకాణాలు మూతపడడంతో బోసిపోతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దుకాణాలు బంద్ చేయడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఖజానా నింపుకోవడానికి తమపై బలవంతపు వసూళ్లకు పాల్పడుతోందని పలువురు ఆరోపిస్తున్నారు.

**రూ.22 కోట్లు బకాయిలు.. 25 శాతం చెల్లిస్తేనే ఓపెన్**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ నుంచి నగరపాలక సంస్థగా ఆవిర్భవించింది. పట్టణ ప్రజలు సంతోషపడేలోపే అధికారులు బకాయిల పేరా మున్సిపల్ దుకాణాల సముదాయంపై కొరడా ఝుళిపించారు. దాదాపు ఏడాదిగా అటువైపు చూడని అధికారులు స్పెషల్ ఆఫీసర్ పాలన రాగానే దుకాణాల బకాయిలపై దృష్టి సారించింది. జిల్లా కేంద్రంలో మొత్తం నగర పాలక సంస్థకు చెందిన వివిధ సముదాయాల్లో 258 దుకాణాలు అద్దెకు ఇచ్చారు. గత కొన్నేళ్లుగా ఈ దుకాణాలపై సుమారు రూ. 22 కోట్ల బకాయిలు ఉన్నాయి. దీంతో అధికార యంత్రాంగం హుటాహుటిన ఈ వసూళ్లపై పడింది.

**ఖజానా ఖాళీ చేసి వెళ్లిపోయిన పాలకులు**

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీగా ఉన్నప్పుడు మొత్తం 49 వార్డుల్లో ఏకంగా 40 వార్డులను బీఆర్‌ఎస్ కైవసం చేసుకున్నది. మున్సిపల్ చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్ బీఆర్‌ఎస్‌కు చెందిన వారే.. 2023 డిసెంబర్‌లో అధికారం మారడంతో కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక మున్సిపాలిటీపై కన్నేసింది. పట్టుమని పదిమంది కూడా లేని కౌన్సిలర్లతో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లకు గాలం వేసి ఏకంగా 20 మందిని చేర్చుకున్నారు. చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టి దించేశారు. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిపోయిన కౌన్సిలర్‌కు చైర్మన్ పగ్గాలు అప్పగించింది.

మరోవైపు అధికార యంత్రాంగం కూడా తోడు కావడంతో ఏడాది కాలంగా మున్సిపల్ బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ.. నయా పైసా కాంగ్రెస్ హయాంలో రానప్పటికీ.. ఆయా వార్డుల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మున్సిపాలిటీకి వస్తున్న ఆదాయాన్ని ఏడాదికాలంగా అనుభవించి వెళ్లి పోయేటప్పుడు చిల్లిగవ్వ లేకుండా చేసి వెళ్లిపోయారు. దీంతో మున్సిపాలిటీ గడువు ముగియడంతో స్పెషల్ ఆఫీసర్ పాలన మొదలైంది. మహబూబ్‌నగర్ జాయింట్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో అధికారులు ఆదాయ మార్గాల వైపు చూస్తున్నారు.

**మున్సిపల్ దుకాణాల అద్దె రాజకీయం**

మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థగా మారటం.. స్పెషల్ ఆఫీసర్ పాలన రావడం.. పట్టణ ప్రజలు సంతోషపడేలోపే నగరపాలక సంస్థల కాంప్లెక్స్‌లపై దాడులు నిర్వహించారు. దుకాణాలు నడుస్తుండగానే షెట్టర్లు కిందికి వేసి మూసివేశారు. జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ ప్రాంతంలో పెద్ద మొత్తంలో నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. ఈ కాంప్లెక్స్‌ల్లో ఉన్న దుకాణాలన్నీ ఎప్పుడూ కిటకిటలాడుతుంటాయి. అయితే జిల్లా కేంద్రానికి చెందిన కొంతమంది నేతల అండదండలతో షాపు యజమానులతో కుమ్మక్కై అద్దెలను ఎగ్గొడుతూ వచ్చారు. ఈ క్రమంలో గత ప్రభుత్వ హయాంలో మున్సిపల్ దుకాణాల అన్నింటికీ టెండర్ నిర్వహించి భారీగా ఆదాయం సమకూరేలా చర్యలు చేపట్టింది. కొందరు అత్యాశకుపోయి ఎక్కువ ధరకు పాడి దుకాణాలు దక్కించుకున్నారు. ఇటీవల క్లాక్ టవర్ సర్కిల్‌లో షాపింగ్ మాల్స్ రావడం.. నగర పాలక సంస్థ దుకాణాల్లో గిరాకీ బాగా తగ్గిపోయింది. దీంతో కొంతమంది అద్దెలు కట్టలేని స్థితిలో ఉన్నారు. ఇది గ్రహించిన గత పాలకులు మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ వద్దకు తీసుకెళ్లి పరిస్థితిని వివరించారు. అయితే పాత కిరాయికి మూడు రెట్లు ఎక్కువ కట్టి చెల్లించండి అంటూ.. ఆ తర్వాత మార్గం ఆలోచిద్దాం.. అంటూ పరిష్కారం చెప్పారు. దీంతో హర్షం వ్యక్తం చేసిన వ్యాపారులు ఆ లెక్కన కడుతూ వచ్చారు. కొంతమంది నేతలు బినామీల పేర్లపై దుకాణాలు దక్కించుకొని వ్యాపారస్తులతో వసూలు చేసి నగరపాలక సంస్థకు కట్టడం లేదు. ఈ బకాయిలన్నీ పేరుకుపోయాయి. వీటన్నింటికీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాగా అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం వహించారంటూ ఆరుగురు సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.





బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ దంపతులకు తమ కుమారుడి వివాహానికి హాజరుకావాలని ఆహ్వానపత్రికను అందజేస్తున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు

# పాలబిల్లులు చెల్లించాలి

- పాలను రోడ్డుపై వలకబోసి పాడిరైతుల నిరసన
- ఐదు బిల్లుల బకాయి ఉన్నదని ఆగ్రహం
- మద్దతుతెలిపిన మాజీఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, ఫిబ్రవరి 13 : ఐదు విడుతలుగా బకాయి ఉన్న పాలబిల్లులు చెల్లించాలని మొరపెట్టుకుంటూ గురువారం పాడిరైతులు ఆందోళనకు దిగారు. కడ్తాల మండల కేంద్రంలో హైదరాబాద్– శ్రీశైలం జాతీయ రహదారిపై పాలను వలుకబోసి నిరసన వ్యక్తం చేశారు. పాడి రైతులకు మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పాడి రైతులు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విజయ డెయిరీకి పాలుపోస్తున్నాయని, పాల బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఇప్పటికి ఐదు బిల్లులు సంస్థ బకాయి పడిందని వాపోయారు. ప్రతి 15రోజులకు ఒకసారి చెల్లించాల్సిన పాల బిల్లులు క్రమ పద్ధతిన చెల్లించకపోవడంతో పాడిరైతుల జీవితాలు ఇబ్బందుల్లో పడిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. రెండున్నర నెలల బిల్లులు( 5 బిల్లులు) బకాయి ఉండడంతో దినసరి ఖర్చు లు, భోజనం, పిల్లల ఫీజులకు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని కన్నీళ్లు పెట్టుకున్నారు. కేవలం పాడి పరిశ్రమను నమ్ముకుని బతుకుతున్నామని, పాలబిల్లులు రాకపోవడంతో భిక్షమెత్తుకోవాల్సిన దుస్థితి దాపురించిందని వాపోయారు. పాలబిల్లుల కోసం కడుపుమండి ధర్నాలు చేస్తున్నా.. ప్రభుత్వం కనీ సం పట్టించకోవడం లేదని మండిపడ్డారు. ఇది రైతు ప్రభుత్వం కాదని, రైతులను వేధించే ప్రభుత్వమని రైతులు దుయ్యబట్టారు. పాడిరైతుల ఉసురు రాష్ట్ర ప్రభుత్వానికి ఖచ్చితంగా తగులుతుందని శాపనార్థాలు పెట్టారు. కేవలం కడ్తాల పాలశీతలీకరణ కేంద్రం పరిధిలో రూ.17 కోట్ల పెండింగ్‌లో ఉంటే, రాష్ట్ర వ్యాప్తంగా వందల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, పోసిన పాలకు కూడా బిల్లులు ఇవ్వని దుస్థితిలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాజీనామా చేయాలని పాడిరైతులు డిమాండ్ చేశారు.

**చేతకాని దద్దమ్మ ప్రభుత్వం : జైపాల్**

చేతకాని దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్రాన్ని పాలిస్తుందని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ రేవంత్ సర్కార్‌పై నిప్పులు చెరిగారు. దేశవ్యాప్తంగా ఇంతచేతకాన్ని ప్రభుత్వం మరొకటి లేదనడంలో అతిశయోక్తి లేదని ఆయన దుయ్యబట్టారు. పాడి రైతుల ధర్నాలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పాడిరైతుల పట్ల సానుభూతి వ్యక్తం చేశారు. పాలను అమ్ముకుని జీవనం సాగిస్తున్న పాడి రైతులకు బిల్లులు ఇవ్వలేని దుస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉండటం సిగ్గుచేటన్నారు. అసలు ప్రభుత్వానికి రైతుంటేనే ప్రేమలేదని మండిపడ్డారు. రుణమాఫీ సగంలోనే ఆపివేశారని, రైతు భరోసా ఇస్తారో ఇవ్వరో తెలియని పరిస్థితి ఏర్పడిందని, రాష్ట్రంలో ఇంతకు ప్రభు త్వం ఉం దో లేదో అర్థం కావడం లేదని దుయ్యబట్టారు. నిజం చెప్పాలంటే ఇదిఒక మాయ ప్రభుత్వం, మాటల గారడీ చేస్తూ ప్రజలను వంచనకు గురిచేస్తున్నారని జైపాల్‌యాదవ్ ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వం లో రైతులకు స్వర్ణయుగంలా గడిచిందని, కాంగ్రెస్ ప్రభుత్వం నరకంలా తయారైందని దుయ్యబట్టారు. అంతకు ముందు ఆయన పాడి రైతులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ధశరథ్‌నాయక్, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మహేశ్, అశోక్‌రెడ్డి, నాయకులు రామకృష్ణ, రంగయ్య, ఎలమందరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కృష్ణయ్య, సుధాకర్, శ్రీశైలంయాదవ్, జం గయ్య, రంగనాయక, రాజు, మల్లేశ్, కొండల్, లాలు,రవి, వెంకట్ రాములు, ఆంజయ్య, రాములుతో పాటు పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థి శివారెడ్డి,గైడ్ టీచర్ జరీనాబేగం

## అంతర్జాతీయ స్థాయికి పేట ప్రాజెక్టు

నారాయణపేటరూరల్, ఫిబ్రవరి 13 : జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ అవార్డులు 2024–25 వైజ్ఞానిక ప్రదర్శనలో నారాయణపేట జిల్లాకు చెందిన కొకొనట్ ఫైబర్ పాట్స్ అనే ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పేట డీఈవో గోవిందరాజులు తెలిపారు. గత సంవత్సరం సెప్టెంబర్‌లో 2024లో ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో జాతీయస్థాయిలో జరిగిన పోటీల్లో మొత్తం 137ప్రాజెక్టుల్లో తెలంగాణ నుంచి 4ప్రాజెక్టులు జపాన్‌లో జరిగే అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. అందులో నారాయణపేట జిల్లా నుంచి దామరగిద్ద బాలుర గురుకుల పాఠశాలకు చెందిన శివారెడ్డి తన గైడ్ టీచర్ జరీనాబేగం సాయంతో రూపొందించిన కొకొనట్ ఫైబర్ పాట్స్ అనే ప్రాజెక్టు అంతర్జాతీయ స్థాయికి ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. అదేవిధంగా అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థి, గైడ్ టీచర్‌ను డీఈవో అభినందించారు. జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాశ్, సెక్టోరల్ అధికారులు విద్యాసాగర్, శ్రీనివాస్, రాజేంద్రకుమార్, నాగార్జునరెడ్డి, నర్మద, యాదయ్యశెట్టి తదితరులు విద్యార్థిని, గైడ్ టీచర్‌ను అభినందించారు.

## నిలిచిన 'ఉదండాపూర్' పనులు

- కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు
- పునరావాస ప్యాకేజీ ఇచ్చే వరకు పోరాటం ఆగదు
- భూ నిర్వాసితుల స్పష్టీకరణ





ఉదండాపూర్‌లో రిలే నిరాహారదీక్ష చేపట్టిన భూ నిర్వాసితులు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 13 : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావస ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రెండో రోజు గురువారం ఉదండాపూర్ రిజర్వాయర్ కట్టపై భూ నిర్వాసితులు రిలేదీక్షలు చేపట్టారు. పునరావాస ప్యాకేజీ ఇచ్చే వరకు పనులు చేయొద్దంటూ పనులను అడ్డుకోవడంతో ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు, ఇండ్లు కోల్పోయిన వారికి ఇప్పటి రేట్ల ప్రకారం పరిహారం పెంచి వన్‌టైం కింద ప్యాకేజీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిసారి అధికారులు వచ్చి సర్వే పేరుతో రాసుకొని కేవలం కాంట్రాక్టర్లకు రేట్లను పెంచుతున్నారే తప్పా తమకు ఇవ్వాల్సిన పరిహారం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి పరిహారాన్ని రూ.25 లక్షలు పెంచి ఇప్పిస్తామని హామీ ఇచ్చినా నేటి వరకు ఆ హామీని నెరవేర్చలేదన్నారు. ఆరు నెలల కిందట మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రాజెక్టు పనులను పరిశీలనకొచ్చినపుడు నిర్వాసితులు పరిహారం పెంచి ఇవ్వాలని వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదన్నారు. తాసీల్దార్ స్థాయి అధికారి నుంచి కలెక్టర్ స్థాయి అధికారి వరకు పునరావాస ప్యాకేజీ పెంపు గురించి ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తున్నామంటూ మాటలు చెబుతున్నారని, కానీ తమకు ఎలాంటి న్యాయం జరగడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే పునరావాస ప్యాకేజీని పెంచి పరిహారాన్ని వన్‌టైం సెటిల్‌మెంట్ కింద డబ్బులు చెల్లించేవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

**పరిహారం పెంపు కోసం కృషి : ఎమ్మెల్యే**

ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు పునరావాసం ప్యాకేజీ పరిహారం పెంపు కోసం కృషి చేస్తున్నానని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉదండాపూర్ నిర్వాసితులతో ఆయన మాట్లాడారు. భూ పరిహారం చెల్లింపుల్లో పలు అక్రమాలు జరిగాయని, దీనిపై పునర్విచారణ జరిపించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. కొందరు పరిహారం పంపిణీలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చి ప్రాజెక్టు పనులను అడ్డుకోవాలని చూస్తే సహించేదిలేదని ఆయన హెచ్చరించారు. నిర్వాసితు లందరికీ న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు.



బుద్ధారం శివారులో ఎండిన వరిపైరు

# అడుగంటిన జలం.. ఎండుతున్న పొలం

- హన్వాడ మండలంలో ఎండుతున్న వరి
- బోరుబావుల్లో తగ్గిన నీటిమట్టం
- నెర్రెలుబారిన వరి పొలాలు
- పశుగ్రాసంగా మారిన పంట
- ఆందోళనలో రైతులు

హన్వాడ, ఫిబ్రవరి 13 : యాసంగిలో సాగైన పంటలకు నీటి తడులు అందించలేక అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. చేతికి వస్తుందన్న పంట కండ్ల ముందే ఎండిపోతుండడంతో రైతులకు భంగపాటు తప్పడం లేదు. భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటగా.. బోర్లల్లో నీరు లేక వందల ఎకరాల్లో వరి రైతులు గోస పడుతున్నారు. రైతు భరోసా అందకున్నా.. వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చినా.. పెట్టిన పెట్టుబడులు సైతం ఎల్లని దుర్భర పరిస్థితి నెలకొన్నది.

**నెర్రెలు బారుతున్న పొలాలు**

పచ్చని పంటలు ఎండిపోతున్నాయి. నీళ్లు లేక పొలాలు నెర్రెలు బారుతున్నాయి. రోజురోజుకూ భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కండ్ల ముందే వేసిన పంటలు ఎండిపోతుంటే రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. హన్వాడ మండలంలోని బుద్ధారం, టంకర, హన్వాడ గ్రామాల పరిసరాలల్లో ఈ పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే పదుల సంఖ్యలో నీళ్లులేక పొలం నోళ్లు తెరిచింది.. రాబోయే వేసవిలోగా ఇంకా పెరిగే అవకాశం లేకపోలేదు. వేల రూపాయలు అప్పులు తెచ్చి పంటలు సాగు చేస్తే పంటలు వాడుబడుతుండడంతో రైతు గుండె తరుక్కుపోతోంది. బోర్లల్లో నీళ్లు ఉన్నా.. కరెంట్ ఎప్పుడు పోతుందో.. ఎప్పుడు వస్తుందో.. తెలియని తికమక పరిస్థితి. నీళ్లు పారిన మడికే మళ్లా నీళ్లు అందుతున్నాయని రైతులు వాపోతున్నారు. చెరువులు, కుంటలు నీళ్లులేక ఎండుతుంటే.. భూగర్భ జలాలు గణనీయంగా తగ్గి బోర్లల్లో నీళ్లు రావడం లేదని అన్నదాతలు చెబుతున్నారు. దీంతో పాతాళం నుంచి గంగను రప్పించేందుకు విచ్చలవిడిగా బోర్లు వేస్తున్నారు. ఇదే అదనుగా బోర్‌వెల్స్ యాజమాన్యం రేట్లను పెంచేశారని రైతులు ఆరోపించారు. ప్రభుత్వం ఎండిపోతున్న పంటలను సర్వే చేసి పరిహారం అందిస్తే బాగుంటుందని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు.

**ఎకరాలో వరి సాగు చేశా..**



రూ.18 వేలు పెట్టి ఎకరా పొ లంలో వరి సాగు చేశాను. బోర్లల్లో నీటిమట్టం తగ్గిపోవడంతో వరి ఎండుతోంది. తక్కువ నీళ్లు వస్తుండడంతో ఎకరా టమాట, అర ఎకరలో ఉల్లి సాగు చేశాను. ఈ పంటలకు నీళ్లు కట్టేందుకు కరెంట్ సక్రమంగా ఉండడం లేదు. ఎప్పు డు ఉంటుందో.. ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి. కేసీఆర్ సర్కారులో కరెంట్, నీళ్లకు ఢోకా లేకుండే.. ఈ సారి మాత్రం కష్టాలు తప్ప డం లేదు.. తెచ్చిన అప్పు లు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు. – భీమయ్య, రైతు, టంకర

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

- మాజీ ఎమ్మెల్యే ఆల



కొకుంట్లలో కాంగ్రెస్ నేతలను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్(కొకుంట్ల), ఫిబ్రవరి13 : స్థానిక ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందరూ సిద్ధంగా ఉండాలని, ఐకమత్యంగా ఉండి బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం కొకుంట్ల మండల కేంద్రంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆల హాజరయ్యారు. పార్టీ నిర్మాణంలో భాగంగా బీఆర్ ఎస్ మండల కమిటీ అలాగే అను బంధ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ గ్రామాల్లో కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో కొకుంట్ల బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు**

మూసాపేట(కొకుంట్ల), ఫిబ్రవరి 13 : బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతోనే తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కొకుంట్ల మండలంలోని ముచ్చింతల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు రామకృష్ణారెడ్డి, పుట్టపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కురుమమూర్తి, శేఖర్ కాంగ్రెస్ పార్టీని వీడి బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే ఆల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆల మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోపాలనలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పరుగులు పెట్టిందని, నేడు కాంగ్రెస్ పాలనలో అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని ఆరోపించారు.

## రైతులను దగా చేసిన కాంగ్రెస్



ఖిల్లాఘణపురంలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 13 : ఓట్ల కోసం మాయమాటలు చెప్పి కాంగ్రెస్ రైతులను నట్టేట ముంచిందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణయ్య అన్నా రు. గురువారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. పంటకాలం పూర్తయినా రైతులకు రైతుభరోసా ఇవ్వకపోవడంతో రైతులు అప్పు లు తెచ్చి సాగు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదన్నారు. పంట సాయం నేటికి రైతుల ఖాతాలో జమకాలేదన్నారు. రుణమాఫీ అంతంత మా త్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నట్లు మండిపడ్డారు. గ్రామాల్లో రైతులు నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బోనస్ డబ్బులు ఇచ్చామంటూ గొప్పలు చెప్పి ఇప్పటికీ ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. అధికారుల నుంచి ఎలాంటి సమాచారం లేదని అవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. దేశంలోనే తెలంగాణను మొదటి స్థానంలో నిలిపారని కొనియాడారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, కృష్ణనాయక్, సత్యం, వెం కటేశ్, స్వామినాయక్, బాలాంజనేయులుగౌడ్, రంగారెడ్డి, జనార్దన్, రవీందర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, మ ల్లేశ్, నిర్మల, సుదర్శన్‌చారి, చిన్నారెడ్డి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



నిర్వాసితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

## భూనిర్వాసితులకు మాజీ ఎమ్మెల్యే మర్రి పరామర్శ

తాడూరు, ఫిబ్రవరి 13 : మండల కేంద్రంలో ప్రభుత్వం నూతనంగా నిర్మిస్తున్న 167కే జాతీయ రహదారికి సంబంధించిన బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ పేద దళిత వర్గాలకు చెందిన భూముల్లో నుంచే పోతున్నది. దీంతో ఉన్న కొంత భూమి కోల్పోతున్నామంటూ బాధిత రైతులు వారం రోజుల కిందట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి గురువారం తాడూరులో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కురుమూర్తిని పరామర్శించారు. అదేవిధంగా చిన్నయ్య అనే రైతు ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ కుటుంబాన్ని సైతం పరామర్శించారు. అనంతరం పాపగల్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.రెండు లక్షల పార్టీ బీమా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బొడ్డుపల్లి రమణ, సింగిల్ విండో మాజీ చైర్మన్ సమద్ పాషా, అనిల్‌రెడ్డి, పర్వతాలు, జలీల్ పాల్గొన్నారు.

## అనాథ మహిళ హత్య

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 13 : జిల్లా కేంద్రంలో గురువారం ఉదయం ప్రభుత్వ దవాఖాన వెనుక భాగాన ఉర్దూ మీడియం ప్రైమరీ స్కూల్ గేటు వద్ద ఓ అనాథ మహిళ మృతి చెందిన ఘటన కాలనీవాసుల ద్వారా వెలుగులోకి వచ్చింది. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్ తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని సమీప వ్యక్తులతో విచారించగా నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కావలి శాంతమ్మ(45)గా నిర్ధారించారు. ఈమెకు భర్త, పిల్లలు లేరని కొన్ని రోజుల నుంచి అనారోగ్యం కారణం గా జిల్లా దవాఖానలో చికిత్స కోసం వచ్చేదని అన్నారు. తనకు ఎవరూ కుటుంబ తోడు లేకపోవడంతో అనాథగా జీవనం సాగి స్తూ దవాఖానలో పెట్టే ఉచిత భోజనం తిని ఆ పరిసరాల్లోనే తిరుగుతూ కాలం గడిపేదని చెప్పారు. కాగా ఈమెపై ఎవ రో లైంగిక దాడి చేసి హత్య చేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.